క్లుప్తంగా

దివ్యాంగులకు ఉపకరణాలు అందజేత



రేపల్లె: దివ్యాంగుల సంక్షేమానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా స్వగృహంలో పలువురు దివ్యాంగులకు ఉపకరణాలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు సమస్యలుంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని భరోసానిచ్చారు. వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చల్లా రామయ్య మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధిలో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు కృషి ఎనలేనిదన్నారు. వచ్చే ఎన్నికల్లో అఖండ మెజార్టీతో గెలుపు తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు మోపిదేవి రాజీవ్, దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి శీలం సోమయ్య(భరత్), బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



భట్టిప్రోలు: భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక శ్రీ వేణు గోపాల స్వామి దేవస్థానంలోని సాయికృష్ణ కళా వేదికలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా షుగరు, చెవి, ముక్కు, గొంతు, స్త్రీల సంబంధిత, ఎముకలు, కీళ్ల, సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించారు. వైద్యులు ఆకురాతి శ్రీనివాసరావు, తోట వీరేంద్రనాథ్ , సీహెచ్ పవన్‌కుమార్, డి.హనుమంతయ్య, కె.నాగ సింధూరి పాల్గొని వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని బీఎఫ్ఏ నిర్వాహకులు పర్యవేక్షించారు. సేవలు అందించిన వైద్యులను ఘనంగా సత్కరించారు.

బీఎఫ్ఏ అధ్యక్షుడు గోపినాథ్‌కు సన్మానం



భట్టిప్రోలు: స్నేహితుల దినోత్సవం పురస్కరించుకుని వివేకానంద విగ్రహ సాధన కమిటీ అధ్యక్షుడు బండారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్ (బీఎఫ్ఏ) అధ్యక్షుడు బీవీ గోపినాథ్‌ను ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక బౌద్ధస్తూపం ఎదురుగా ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య సమర యోధుల విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కమిటీ, బీఎఫ్ఏ నిర్వాహకులు పాల్గొన్నారు.

బండ్లమ్మకు వైభవంగా పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం) : మండలంలోని చందోలులో వేంచేసి ఉన్న శ్రీ బగళాముఖి బండ్లమ్మ దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పసుపు, కుంకుమలతో అర్చనలు, అభిషేకాలు జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి కొబ్బరి కాయలు కొట్టి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

తెనాలిలో ద్విచక్ర వాహన ర్యాలీ

తెనాలిఅర్బన్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక-కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీఐటీయూ తెనాలి కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ద్విచక్ర వాహన ర్యాలీని నిర్వహించారు. మున్సిపల్ మార్కెట్ నుంచి ప్రారంభమైన ర్యాలీ పట్టణంలోని ప్రధాన వీధుల్లో కొనసాగింది. ఈ సందర్భంగా సీఐటీ జిల్లా నాయకులు కె.బాబుప్రసాద్, ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డిలు మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రం కాలరాస్తుందని విమర్శించారు. మూడు వ్యవసాయ చట్టాలను రద్దు చేసిన వాటిని అనాధికారికంగా అమలు చేస్తుందని ఆరోపించారు. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు షేక్ హుస్సేన్‌వలీ, మంగళగిరి వెంకటేశ్వరరావు, రైతు సంఘం నాయకులు ఎం.సాంబశివరావు, ఎం.యలమందయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంబరాన్నంటిన..ఎంపీ మోపిదేవి జన్మదిన వేడుకలు

రేపల్లె: రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకట రమణారావు జన్మదిన వేడుకలు ఆదివారం అంబరాన్నంటాయి. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి అభిమానులు ర్యాలీగా రేపల్లె పట్టణంలోని ఆయన ఇంటికి చేరుకుని ఎంపీకి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున భారీ గజమాలతో ఎంపీ మోపిదేవి దంపతులను సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రేపల్లె నియోజకవర్గాన్ని ఎంపీ మోపిదేవి అభివృద్ధి చేశారని, శక్తివంచన లేకుండా పనిచేయటంతో ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు. మోపిదేవి రాజకీయంగా మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బావుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, డీఎస్పీ తక్కెళ్లపాటి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్‌లు, ఎంపీపీ మోపిదేవి విజయ నిర్మల, సీనియర్ నాయకులు మోపిదేవి హరనాథబాబు, జెడ్పీటీసీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, అభిమానులు భారీగా తరలివచ్చి మోపిదేవికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన అభిమానులకు మోపిదేవి నివాసంలో భోజనాలు ఏర్పాటు చేశారు.



గజమాలతో ఎంపీని మోపిదేవి దంపతులను సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున



శుభాకాంక్షలు చెబుతున్న పార్టీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, కోటేశ్వరమ్మ దంపతులు



ప్రజాప్రతినిధులు, అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న ఎంపీ మోపిదేవి

ఐకమత్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలి

రేపల్లె రూరల్: అర్చకులు ఐకమత్యంతో సమస్యలను పరిష్కరించుకోవాలని ఏపీ అర్చక సమాఖ్య బాపట్ల జిల్లా అధ్యక్షుడు నారాయణం శరత్‌చంద్ర అన్నారు. పట్టణంలోని ఇసుకపల్లి శివాలయంలో ఆదివారం ఏపీ అర్చక సమాఖ్య జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తమ సమస్యలను సమీక్షించి, భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. అనంతరం పలువురు అర్చకులను సత్కరించారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య రాష్ట్ర నాయకులు అగ్నిహోత్రం ఆత్రేయబాబు, నారయణం కాకుమాను సిద్ధాంతి, వేదాంతం వరదాచార్యులు, చావలి త్రిలోచన శర్మ, రొంప్పిచర్ల విజయసారథి, చావలి సురేష్ శర్మ, బృందావనం ఫణికుమార్, కొమ్మూరి పవన్‌కుమార్ పాల్గొన్నారు.



అర్చకులను సత్కరిస్తున్న సమాఖ్య సభ్యులు

విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ



వెల్లటూరు(భట్టిప్రోలు): వీఆర్వో (గ్రామ పునర్నిర్మాణ సంస్థ) ఆధ్వర్యంలో ఎస్టీ కాలనీలలో చిన్నారులకు బ్యాగ్‌లు, పుస్తకాలు, పలకలు స్టేషనరీ ఆదివారం అందజేశారు. వీఆర్వో సంస్థ ప్రాజెక్ట్ ఆఫీసర్ శౌరిరాజు మాట్లాడుతూ వెల్లటూరు జగనన్న కాలనీలో చిన్నారులకు వీటిని అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చౌటూరి లక్ష్మి, రవీంద్ర, సంస్థ రేపల్లె సర్కిల్ కో-ఆర్డినేటర్ కె.దేవకి, సంస్థ వలంటీర్లు పాల్గొన్నారు.

వెల్లటూరులో శాంతి ర్యాలీ

వెల్లటూరు(భట్టిప్రోలు): మణిపూర్ రాష్ట్ర క్రైస్తవుల న్యాయం కోసం వెల్లటూరు ఉత్తర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ బి.శ్రీకాంత్ మాట్లాడుతూ మణిపూర్ ప్రభుత్వ అసమర్థత వల్లే ఆదివాసి క్రైస్తవులు, చర్చిలపై అసాంఘిక శక్తులు దాడులు చేసి, విధ్వంసం సృష్టించాయన్నారు. మహిళలపై అల్లరి మూకల పాశవిక చర్యలు అత్యంత హేయమని ఖండించారు. బాధితులకు పునరావాసం కల్పించి ఆదుకోవాలన్నారు. దాడులకు తెగబడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. స్థానిక చర్చి వద్ద నుంచి ర్యాలీగా ప్రధాన రహదారి వద్దకు చేరుకుని మానవహారం ఏర్పాటు చేశారు.

పాస్టర్ల శాంతి ర్యాలీ



చుండూరులో క్రైస్తవులు శాంతి ర్యాలీ

చుండూరు: మణిపూర్‌లో క్రైస్తవులపై చేసిన దాడులను ఖండిస్తూ.. మండల కేంద్రంలో పాస్టర్లు ఆదివారం శాంతి ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం క్రైస్తవులపై దాడులకు పాల్పడిన వ్యక్తులపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి



కొల్లూరు : ఆత్మహత్యాయత్నం చేసిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై ఆదివారం కేసు నమోదయ్యింది. పోలీసులు వివరాల మేరకు.. చినపులివర్రుకు చెందిన శొంఠి నాగేశ్వరరావు కుమారుడు లక్ష్మణ్ (27) అప్పుల బాధతో గత నెల 27న పురుగు మందు తాగి, ఆత్మహత్యాయత్నం చేశాడు. అప్పట్నుంచి పలు వైద్యశాలల్లో చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స తీసుకుంటూ శనివారం రాత్రి మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ జి.రాజ్యలక్ష్మి తెలిపారు.

పోలేరమ్మకు రూ.1.50లక్షల బంగారు ఆభరణం

బాపట్ల అర్బన్: పడమర బాపట్ల పంచాయతీ వైఎస్సార్ నగర్ గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మకు ఆదివారం దాత మేడిబోయన శ్రీనివాసరెడ్డి రూ.1.50లక్షల బంగారు ఆభరణాన్ని గ్రామపెద్ద ఆసోది సుబ్బారెడ్డికి అందజేశారు. గ్రామదేవత పోలేరమ్మ కృపాకటాక్షాలు గ్రామంపై మెండుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు తుమ్మా వెంకటేశ్వరరెడ్డి, ఆసోది కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, సమ్మెట అయ్యప్పరెడ్డి, శవనం శ్రీనివాసరెడ్డి , నారాయణరెడ్డి, మేడిబోయిన స్వామిరెడ్డి, శీలం రంగారెడ్డి, ఆట్ల కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



బంగారు ఆభరణం అందజేస్తున్న దాత శ్రీనివాసరెడ్డి

ఫోర్టిఫైడ్ బియ్యంతో బహుళ ప్రయోజనాలు

- రెండునెలలుగా ఇంటింటికీ రేషనులో పంపిణీ
- అపోహలతో బియ్యం తీసుకోని కొందరు కార్డుదారులు



వాహనంతో రేషను పంపిణీ



ఫోర్టిఫైడ్ బియ్యం

తెనాలి: ×రేషను బియ్యం నీళ్లలో తేలుతోంది...ప్లాస్టిక్ బియ్యం కలిపార్రోయ్...₹ విద్యావంతుడైన ఓ మాజీ విలేకరి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు ఇది...సాధారణ ప్రజల్నుంచీ అక్కడక్కడా ఈ మాటలనే వింటున్నాం. కొందరు కార్డుదారులు బియ్యం తీసుకోవడం లేదు. బదులుగా కిలో రూ.10 చొప్పున డబ్బులు తీసుకుంటున్నారు. పేద ప్రజలకు బలవర్ధక ఆహారం పంపిణీ చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం వ్యయప్రయాసల కోర్చి ఇంటింటికీ సరఫరా చేస్తున్న ఫోర్టిఫైడ్ రేషను బియ్యంపై అపోహలకు ఇంతకు మించిన ఉదాహరణలు ఏముంటాయి? అక్కడక్కడా పట్టుబడుతున్న పీడీఎస్ బియ్యం, కార్డుదారులు వద్దనుకుని డబ్బులు తీసుకున్నవే.

గత జూన్ నెలనుంచి...

గుంటూరు జిల్లాలో గత జూన్ నెలనుంచి రేషను కార్డుదారులకు ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరా చేస్తున్న విషయం తెలిసిందే. జిల్లాలోని 5.94 లక్షల కార్డుదారులకు ప్రతినెలా ఫోర్టిఫైడ్ బియ్యాన్నీ, కిలో రూ.16లకు ఫోర్టిఫైడ్ గోధుమ పిండిని ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. నెలకు 8,000 టన్నుల బియ్యం కార్డుదారులకు చేరుతోంది. రేషను సరుకులేంటే గతంనుంచీ ఉన్న చిన్నచూపు ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రస్తుత ప్రభుత్వం పోషకాలు జతచేసిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ఇస్తున్నా, అవగాహన లేమి, దుష్ప్రచారంతో చేజేతులా వదులుకుంటున్నారు. వాస్తవానికి ఫోర్టిఫైడ్ బియ్యంతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. 5వ జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వే నివేదిక ప్రకారం మనదేశంలో అయిదేళ్లలోపు పిల్లల్లో 32.1 శాతం సాధారణంగా ఉండాల్సిన బరువుకన్నా తక్కువగా ఉన్నారు. 35 శాతం పిల్లలు వయసుకు ఉండాల్సినంత ఎత్తు పెరగటం లేదు. సాధారణ మహిళలు, గర్భిణులు 50 శాతంకన్నా ఎక్కువమంది రక్తహీనతతో బాధపడుతున్నారు. రోజువారీ తీసుకునే ఆహారంలో పోషకాల లోపమే ఇందుకు ప్రధాన కారణమని చెప్పాల్సిన పనిలేదు. ఈ లోపాన్ని పరిష్కరించేందుకు కేంద్రప్రభుత్వం ఆహార పదార్థాల ఫోర్టిఫికేషన్ ప్రక్రియను ప్రోత్సహిస్తోంది. ఆ ప్రకారం రాష్ట్రప్రభుత్వం, ప్రజాపంపిణీలో భాగంగా వినియోగదారులకు అందిస్తున్న సాధారణ రేషను బియ్యానికి బదులు పోషకాలు కలిగిన ఫోర్టిఫైడ్ బియ్యం పంపిణీని చేపట్టింది. ఇంటింటికీ రేషనులోనే కాకుండా గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లు, మధ్యాహ్న భోజన పథకానికి కూడా ఫోర్టిఫైడ్ బియ్యాన్నే సరఫరా చేస్తున్నారు.

మన ఆహారంలో పోషకాలు...

మన ఆహారంలో ప్రధానమైన బియ్యం మిల్లింగులో ఏవైతే విటమిన్/పోషకాలు లోపిస్తాయో? వాటిని చేర్చడమే ఫోర్టిఫికేషన్. నిర్ణీత పరిమాణంలో బియ్యం పిండికి, సూక్ష్మధాతు పోషకాల మిశ్రమం కలిపి బియ్యం రూపాన్ని పోలివుండే ×కర్నల్స్₹ను తయారుచేస్తారు.

వీటిలో ఐరన్ 42.5 మిల్లీగ్రాములు, ఫోలిక్ 1250 మైక్రోగ్రాములు, బీ12 విటమిన్ 12.5 మైక్రోగ్రాములు ఉంటాయి. డ్రై చేశాక వీటిని బియ్యంలో కలుపుతారు. గోధుమపిండిని కూడా సంప్రదాయ విధానమైన తిరగలితో చేసిన పిండితో ఫోర్టిఫైడ్ చేస్తున్నారు. మార్కెట్‌లో సాధారణ రకం గోధుమపిండి కిలో రూ.30, బ్రాండెడ్ కంపెనీల ఆటా అయితే కిలో రూ.60 వరకు ఉన్న విషయం తెలిసిందే. ప్రభుత్వం బలవర్ధకమైన బియ్యాన్ని ఉచితంగా, గోధుమలను కిలో రూ.16 చొప్పున ఇస్తుంటే వాటిని వినియోగించితేనే కదా ఫలితాలను పొందగలిగేది.

రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంపూర్ణ పోషణ, గోరుముద్ద, మధ్యాహ్న భోజన పథకాలతో రక్తహీనత క్రమేపీ తగ్గుముఖం పడుతోంది. 5వ జాతీయ కుటుంబ, ఆరోగ్య సర్వే ప్రకారం గర్భిణుల్లో రక్తహీనత 52.9 శాతం నుండి 53.9 శాతానికి పెరిగింది. 15-19 వయసుగల బాలికల్లో 61.1 నుండి 60.1 శాతానికి తగ్గింది. 15-19 వయసుగల బాలురలో 29.3 శాతం నుంచి 18.7 శాతానికి తగ్గుదల నమోదైంది. పొరుగు రాష్ట్రమైన తెలంగాణతో పోల్చుకుంటే రాష్ట్రం మెరుగైన స్థితిలో ఉంది. ఫోర్టిఫైడ్ బియ్యంతో మరింత ఆరోగ్య ప్రయోజనం కలుగుతుందని చెప్పొచ్చు.

> **రక్తహీనత సమస్యను అధిగమిస్తారు...**
>
> ఫోర్టిఫైడ్ బియ్యం తయారీకి ప్రభుత్వం ఎంతో ఖర్చు చేస్తోంది. బలవర్ధకమైన పోషకాలు కలిగిన బియ్యాన్ని ఇంటింటికీ పంపిణీ చేస్తున్నాం. ఈ బియ్యంతో రక్త శుద్ధి జరిగి, రక్తహీనత తగ్గుతుంది. నాడీవ్యవస్థ మెరుగుపడుతుంది. ప్రజలు అపోహలకు పోకుండా తప్పనిసరిగా వినియోగించాలి.
>
> – కోమలి పద్మ, గుంటూరు జిల్లా, పౌరసరఫరాల అధికారి

రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు మెరుగుపరచాలి

రేపల్లె రూరల్: అమృత్‌భారత్‌లో భాగంగా ఆధునికీకరణ చెందుతున్న రేపల్లె రైల్వేస్టేషన్‌లో సౌకర్యాలు మెరుగు పరచాలని పట్టణ ఆదర్శ వేదిక కన్వీనర్ యడ్లపల్లి కిషోర్ అన్నారు. రైల్వేస్టేషన్ అభివృద్ధిలో చేపట్టాల్సిన పలు అంశాలను స్థానిక రైల్వే స్టేషన్‌లో ఏడీఆర్‌ఎం సైమన్, డివిజనల్ కో-ఆర్డినేటర్ అనూషకు ఆదివారం వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. టెర్మినల్ పాయింట్ ఏర్పాటు చేసి, సీడబ్ల్యూయూ స్టాఫ్‌ను రేపల్లె రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేస్తే రాబోవు రోజుల్లో రైళ్లకు సంబంధించిన రిపేర్లు చేసుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. అదేవిధంగా కోచ్ ఇండికేషన్ బోర్డును ఏర్పాటు చేయాలన్నారు. తూర్పుగేటు రోడ్డు నుంచి పడమర వైపు గేట్ రోడ్డుకు స్ట్రెయిట్ రోడ్డును ఏర్పాటు చేయాలన్నారు. బ్రిటీష్‌కాలం నాటి బ్రిడ్జ్‌ను తొలగించి రాబోయే రోజులలో డెమో రైలు ఆగే పాయింట్ వద్ద నూతన బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన రైల్వే అధికారులు సమస్యలను పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.



ఏడీఆర్‌ఎం సైమన్, డివిజనల్ కో-ఆర్డినేటర్ అనూషకు వినతిపత్రం అందజేస్తున్న కిషోర్

250 మందికి వైద్య పరీక్షలు

కర్లపాలెం: ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా పూర్వ విద్యార్థులు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు కె.కృష్ణంరాజు అన్నారు. ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1982- 83, 1983-84 బ్యాచ్‌ల విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో విజయవాడ సెంటినీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కిరణ్, డాక్టర్ శ్రీపతి బృందం 250 మందికి ఉచితంగా బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఈసీజీ, ఎకో పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. ఈ సందర్భంగా కార్డియాలజీ వైద్యులు కిరణ్ మాట్లాడుతూ సరైన ఆహారపు అలవాట్లు కలిగి ఉండటంతో పాటు ఎలాంటి ఒత్తిడిలేని జీవనం అలవర్చుకోవాలని చెప్పారు. మెడికల్ క్యాంపునకు వచ్చిన వారికి పూర్వ విద్యార్థులు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సెంటినీ హాస్పిటల్ పీఆర్వో పెదబాబు, ప్రవీణ్, పాఠశాల పూర్వ విద్యార్థులు ఉన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కిరణ్

ఐసీడీఎస్ కార్యాలయం సందర్శన

రేపల్లె: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం, పేటేరు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆదివారం ప్రాజెక్ట్ డైరెక్టర్ మన్నెల విజయ సునీత సందర్శించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు, ఆయాలకు గర్భిణులు, బాలింతలు, శిశువు ఆరోగ్యానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పౌష్టికాహారంపై సూపర్‌వైజర్‌లతో సమీక్షించారు. కార్యక్రమంలో అధికారులు శైలజ, బాపట్ల ప్రాజెక్ట్ అడిషనల్ ప్రాజెక్ట్ అధికారిణి శివపార్వతీ పాల్గొన్నారు.

గద్దర్ మృతికి పలువురి నివాళి

రేపల్లె: ప్రజా, దళిత బహుజన ఉద్యమంలో చురుకుగా పాల్గొని సమస్యల పరిష్కారానికి నిరంతరం పరితపించిన గద్దర్ మృతిపట్ల ఆదివారం పట్టణంలోని పలు ప్రజాసంఘాలు సంతాపం తెలిపాయి. ఉద్యమాలకు గద్దర్ చేసిన సేవలను పలువురు కొనియాడారు. నివాళులర్పించిన వారిలో రేపల్లె తాలూకా ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సమాఖ్య, బహుజన ప్రజా సంఘాలు, మానవ హక్కుల సంఘాలు, అంబేడ్కర్ యువజన సంఘాల నాయకులు దర్శి భాస్కరరావు, దారం సాంబశివరావు, డొక్కా శ్రీనుబాబు, పమిడిపాము రవి, నన్నేపాము చందు, అందే శ్యామ్, మునిపల్లి సుబ్బయ్య, జై భీమ్ భారత్ పార్టీ నాయకులు దోవా రమేష్‌రాంజీ తదితరులున్నారు.

అమరవీరులకు ఘన నివాళి

చుండూరు(వేమూరు): చుండూరు అమర వీరులకు దళిత సంఘాల నాయకులు నివాళులర్పించారు. చుండూరు మండల కేంద్రంలోని అమరవీరుల రక్త క్షేత్రం వద్ద ఆదివారం జోహార్లు అర్పించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. చుండూరు అమర వీరుల కమిటీ చైర్మన్ జోసఫ్ సభలో మాట్లాడుతూ కారంచేడు, చుండూరు మారణ హోమాల అగ్ర కులాల దురహంకారానికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా ఇన్‌చార్జీ మంద వెంకటేశ్వరరావు మాదిగ, గుంటూరు జిల్లా ఎమ్మార్పీఎస్ కన్వీనర్ వేమూరు సుధీర్ మాదిగ, వేమూరు నియోజకవర్గం ఇన్‌చార్జీ యల్లమాటి దాసు, కన్వీనర్ ముస్నంగి ఐజాక్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.



అమరవీరులకు నివాళులర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

రఫీ గీతాలకు ప్రేక్షకుల ఫిదా

తెనాలి: అమరగాయకుడు మహమ్మద్ రఫీ 43వ వర్ధంతి సందర్భంగా స్థానిక రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఆదివారం రాత్రి ×రఫీ సాబ్‌కె గానే₹ పేరుతో మహమ్మద్ రఫీ పాటలతో సంగీత విభావరిని నిర్వహించారు. పట్టణానికి చెందిన ప్రముఖ పిల్లల వైద్యుడు డాక్టర్ కె.పురుషోత్తమరావు ఈ సంగీత విభావరిని నిర్వహించటం, తోటి గాయనీ గాయకులతో కలిసి రఫీ పాటలను గానం చేశారు. సంగీతాభిమానుల ప్రశంసలను అందుకున్నారు. గాయకుడు రఫీ వర్ధంతికి ఏటా సంగీత విభావరిని నిర్వహిస్తున్న డాక్టర్ పురుషోత్తమరావును అభినందించారు. పాకీజా, హమ్‌దోనోం, చిరాగ్, ఉస్తాదోంకె ఉస్తాద్, కశ్మీర్ కీ కలీ, అక్బర్ సలీం అనార్కలి, హాతీకీ సఫాయియా, తాజ్‌మహల్, గైడ్, హాథీ మేరే సాథీ, దో రాస్తే, నూరజ్, పగ్లా కహీ కా వంటి హిందీ చిత్రాలు, ఆరాధన, భలేతమ్ముడు తెలుగు చిత్రాల్లో రఫీ, ఇతర గాయనిలు ఆలపించిన పాటలను ప్రముఖ గాయనీ గాయకులు షానవాజ్, అలీఖాన్, సైదా, శివలీల, మల్లిక రఫీ ఆలపించారు. కళాక్షేత్రంలో కిక్కిరిసిన ప్రేక్షకులను అలరించారు. సైదా ఆర్కెస్ట్రా వాద్య కళాకారులు సంగీత సహకారం అందించారు. డాక్టర్ పువ్వాడ సోమశేఖర్, డాక్టర్ వంగా సాంబిరెడ్డి, కె.రాజేశ్వరరావు, డాక్టర్ ప్రసాదరావు, డాక్టర్ రంగారావు, డాక్టర్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ పురుషోత్తమరావు, మల్లిక గానాలాపన

శత సంవత్సర జన్మదినోత్సవం

తెనాలిటౌన్: రూరల్ మండలం ఎరుకలపూడి గ్రామానికి చెందిన మోతుకూరు సుబ్బారావు శత సంవత్సర జన్మదినోత్సవ వేడుకలను ఆదివారం ఆయన కుటుంబ సభ్యులు ఘనంగా జరిపారు. సుబ్బారావు 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని 101వ సంవత్సరంలోకి చేరుకున్నారు. ఆయన గృహంలో కుమారులు, కుమార్తెలు కోడళ్లు, అల్లుళ్లు, మనుమలు, మునిమనుమలు, బంధువులు సుబ్బారావును శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కుమారులు తండ్రి కాళ్లు కడిగి ఆయనకు నమస్కరించారు. సుమారు 60 నుంచి 70 మంది వరకు కుటుంబ సభ్యులు ఉన్నారు. ఆయనకు 5గురు మగపిల్లలు, నలుగురు ఆడపిల్లలు కాగా వారిలో నలుగురు మగ, ఇద్దరు ఆడపిల్లలు ప్రస్తుతం ఉన్నారు. వ్యవసాయం చేసుకుని జీవనం సాగించి కష్టపడి పిల్లలను పెంచారని కుటుంబ సభ్యులు తెలిపారు. కార్యక్రమాన్ని కుమారులు వెంకట్రావు, అర్జునరావు, వెంకటకృష్ణ, ఏడుకొండలు పర్యవేకించారు. వైఎస్సార్ సీపీ నాయకులు యలవర్తి సాంబశివరావు,"గ్రామ వైఎస్సార్ సీపీ కన్వీనర్ పి వెంకట సత్యనారాయణలు పాల్గొన్నారు.

వ్యక్తిపై కర్రలతో దాడి

బాపట్లటౌన్: కుటుంబ కలహాల నేపథ్యంలో కర్రలతో దాడిచేసిన ఘటన పట్టణంలోని దేవుడి మాన్యంలో చోటుచేసుకుంది. దేవుడు మాన్యంకు చెందిన మోపర్తి సుధాకర్‌పై అతని బావ శ్రీనివాసరావు, అక్క సునీత, మేనల్లుడు నవీన్, మేనకోడలు చిన్ని కలిసి కర్రలతో దాడిచేశారని ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్ఐ రఫీ కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నారు.